క్లుప్తంగా

సర్కారు బడుల్లో 'తిథి' భోజనం



భోజనం వడ్డిస్తున్న దాత అరుణ్, ఉపాధ్యాయులు

తాంసి: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు మరింత పోషకాహారం అందించేందుకే ప్రభుత్వం తిథి (సామూహిక) భోజన కార్యక్రమాన్ని చేపట్టిందని కప్పర్ల పాఠశాల హెచ్ఎం ఆనంద్ తెలిపారు. తిథి కార్యక్రమంలో భాగంగా దాత గంగ్రెత్ అరుణ్ సహకారంతో మంగళవారం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. గ్రామపెద్దలతో కలిసి భోజనాన్ని వడ్డించి తిథి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ సంతోష్, గ్రామపెద్ద నారాయణ, ఉపాధ్యాయులు కిష్టన్న, విలాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

ఇంద్రవెల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.సంతోష్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలకేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం ఎదుట మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. బయోడైవర్సిటీ బోర్డు జిల్లా కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపినాథ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, జిల్లా నాయకులు ఉత్తం, ఎఫ్ఎస్‌వోలు రాజేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇంద్రవెల్లి: మహిళలు, యువతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్ అన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కేస్లాగూడలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్ మాట్లాడుతూ చట్టాల గురించి తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. సుకన్య సమృద్ధి యోజన, బేటీ బచావో బేటీ పడావో గురించి వివరించారు. ఆర్థిక అక్షరాస్యత నిపుణులు నిక్లేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజులత, సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎదులాపురం: కలెక్టరేట్ సమీపంలోని జైనథ్ మండల సీడీపీవో కార్యాలయంలో తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మిషన్ శక్తి జిల్లా కోఆర్డినేటర్ యశోద వివరించారు. సీడీపీవో నర్సమ్మ, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, విజయ్, ముంతాజ్, శృతి ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ'ఏ'లో చేర్చాలి



భీంపూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

తాంసి: అత్యంత వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ'ఏ'లో చేర్చాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులతో కలిసి భీంపూర్ తహసీల్దార్ సత్యనారాయణరావుకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పది శాతం ఉన్న ముదిరాజ్‌లు పేదరికంలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని బీసీ'ఏ'లో చేర్చాలని కోరారు. నాయకులు గడ్డం లస్మన్న, సుభాష్, రాములు, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

పౌరసరఫరాల సంస్థ డీఎంకు వినతి

కైలాస్‌నగర్: సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పేర్కొన్నారు. జిల్లాలోని హమాలీ కార్మికులను అనుమతించి కార్యక్రమ విజయవంతానికి సహకరించాలని కోరుతూ మంగళవారం జిల్లా పౌరసరఫరాలసంస్థ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అఫ్రోజ్, సలీం తదితరులున్నారు.

వానాకాలం.. పశువులు పైలం

- గుర్తించకపోతే ప్రాణాలకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటిస్తేనే మేలు



పశువులకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

నేరడిగొండ: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ తెలిపారు. పశువులకు సోకే వ్యాధులను రైతులు, పశుపోషకులు త్వరితగతిన గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి నివారించవచ్చని సూచించారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర వివరాలను వెల్లడించారు.

గొంతువాపు వ్యాధి

- ప్రస్తుతం పచ్చిక అధికంగా ఉన్నందున పశువులకు పారుడు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. సాధారణ మందులతో తగ్గించుకోవచ్చు.
- పచ్చిక మేతలో ఉండే గొంతవాపు బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి రావడానికి అవకాశం ఉంది.
- బలహీనంగా ఉండే గేదెలకు ఈ వ్యాధి సోకుతుంది.
- జ్వరం 104 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది.
- గొంతువాపు రావడంతోపాటు నోరు, కంటి నుంచి స్రవాలు వస్తాయి.
- ఈ లక్షణాలు కనిపిస్తే వ్యాధి సోకిన పశువుగా గుర్తించి, ఇతర పశువులతో వేరుగా ఉంచాలి.
- ఈ వ్యాధి గాలి, నీరుతో వ్యాప్తి చెందుతుంది.
- లక్షణాలు గమనించిన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- సకాలంలో ఇంజక్షన్లు, మందులు వేస్తే కాపాడవచ్చు.
- లేదంటే 24 గంటల్లో ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉంటుంది.

చికిత్స

- ఇటీవల ఎన్నో కొత్త మందులు, యాంటిబయోటిక్స్ లభిస్తున్నాయి.
- సల్ఫాడిమిడ్, ఇంటాసెఫ్ టాజు తదితర ఇంజక్షన్లు బాగా పనిచేస్తాయి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సలహాలతో వాడాలి.

నివారణ చర్యలు

- వ్యాధితో మరణించిన పశువులకు వాడిన గడ్డి, దాణా, నీటిని వేరే పశువులకు పెట్టకుండా జాగ్రత్తపడాలి.
- గొంతువాపు త్వరగా వ్యాపించే అంటువ్యాధి.
- ఈ వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచి చికిత్స చేయాలి.
- మృతిచెందిన పశు కళేబరాన్ని, అవి తినగా మిగిల్చిన గడ్డిని నీటి ప్రవాహాల్లో, నీళ్లలో పడేయకుండా లోతైన గొయ్యి తీసి పాతిపెట్టాలి.

జబ్బువాపు వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి బలిష్టంగా ఉన్నా మూడేళ్లలోపు వయసు గల ఆవుల్లో అధికంగా వస్తుంది.
- ఇది సాధారణంగా వర్షాకాలంలోనే వస్తుంది. పశువుల ప్రాణాలకు ముప్పు తెస్తుంది.
- వ్యాధి సోకిన ఆవులకు జబ్బల మధ్యలో వాపు వస్తోంది.
- ఆ భాగంలో చేతితో రుద్దినప్పుడు ఇసుకను తాకిన శబ్దంతో కూడిన స్పర్శ వస్తుంది.
- 104, 108 డిగ్రీల జ్వరంతోపాటు నీరసంగా ఉండి మేత తినవు.
- నోటి, కళ్ల వెంట స్రవాలు వస్తాయి. వ్యాధిసోకిన 12 నుంచి 24 గంటల్లోనే చనిపోయే ప్రమాదం ఉంటుంది.

చికిత్స విధానం

- వ్యాధి ప్రారంభంలోనే పెన్సిలిన్, యాంటి బయోటిక్స్ వాడాలి.
- యాంటిపైరెటిక్స్, యాంటి హిస్టమిక్స్ వాడాలి. కార్టిజోన్స్, డెక్ట్రోజ్ నార్మల్ సెలెన్ వాడాలి.

నివారణ చర్యలు

- తొలకరితో పశువులకు జబ్బువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.
- వ్యాధిని గుర్తించి పశువులకు చికిత్స అందించేందుకు ఆస్పత్రికి తీసుకెళ్లాలి. వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులతో వేరుగా ఉంచాలి.
- పశు కళేబరాన్ని కాల్చివేయాలి. లేదా గొయ్యిలో పాతిపెట్టాలి. వ్యాధి సోకిన ప్రాంతాల్లో పశువులను మేయనీయకుండా చూడాలి.

జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రైతులు, పశుపోషకులు జాగ్రత్త వహించాలి. పశువైద్యుల సలహా, సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలి. వైద్యులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అవసరమైతే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

– రాథోడ్ జీవన్, పశువైద్యాధికారి,నేరడిగొండ

చెత్త తొలగించిన బల్దియా

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో, డీఈవో కార్యాలయ సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొన్న తీరును వివరిస్తూ 'ఇలాగైతే రోగాలు రావా', 'రోడ్డు పక్కనే చెత్తాచెదారం'శీర్షికన ఈనెల 29, 30వ తేదీల్లో ప్రచురితమైన 'సాక్షి'కథనాలకు బల్దియా అధికారులు స్పందించారు. చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టారు. జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా పారిశుధ్య కార్మికులు చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని అందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ కోరారు. చెత్తను రోడ్లపై పడేయకుండా తమ ఇళ్లు, దుకాణాల ముందుకు వచ్చే చెత్త వాహనాలకు అందించాలన్నారు.



రాంనగర్‌లో చెత్తను తొలగింపు తర్వాత



డీఈవో కార్యాలయ సమీపంలో..



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

పంట నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న బ్రహ్మానంద్

ఇంద్రవెల్లి: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, రాష్ట్ర నాయకుడు రితేష్ రాథోడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. గిరిజనేతరుల సాగు భూములకు పట్టాలివ్వాలని, వాల్గొండ హీరాపూర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి మంజూరు చేయాలన్నారు. చిక్‌మాన్ ప్రాజెక్టు, త్రివేణి సంఘం వద్ద కెనాల్ ఏర్పాటు, పేదలకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరెల్లి రాజలింగు, మెస్రం తుకారాం, మరప రాజు, కనక తుకారం, చంపత్‌రావ్, రాథోడ్ భీంరావ్, దిలీప్ మోరే, మారుతి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

కైలాస్‌నగర్: జిల్లాలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగినందున హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజలకు వైద్యమందించేలా చూడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని మంగళవారం ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ మండలాలైన గుడిహత్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, బోథ్ ప్రాంతాల్లో విష జ్వరాలతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. ఉట్నూర్, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఓపీ సమయాన్ని సాయంత్రం వరకు పొడిగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ పరిధిలో ఐటీడీఏ అంబులెన్సుల సంఖ్య పెంచాలని పేర్కొన్నారు.

వాగు దాటించారు.. అవగాహన కల్పించారు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అత్యవసర వేళలో వాగులు దాటేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి డీడీఆర్ఎఫ్ బృందం సభ్యులు వివరించారు. గాదిగూడ మండలం అర్జునిమారుగూడకు వెళ్లేందుకు అక్కడికి వచ్చిన 30 మంది మహిళలకు తాడు సాయంతో వాగు దాటించారు. ఆ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీఐ రహీంపాషా, గాదిగూడ ఎస్సై మహేశ్ కుమార్, డీడీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీడీఆర్ఎఫ్ సిబ్బంది

జిల్లా జడ్జిని కలిసిన ఏజీపీ

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో ఇటీవల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన పంద్రం శంకర్ మంగళవారం అదిలాబాద్ జిల్లా జడ్జి కె.ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు.



ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏజీపీ శంకర్

ఏఆర్ఎస్ ఎదుట కార్మికుల ధర్నా

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్)లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ఎస్ ఎదుట మంగళవారం కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్మికులు 20 ఏళ్లుగా పని చేస్తున్నారని, వారికి రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని, నెలకు 26 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

సీఐటీయూ నాయకులు స్వామి, ఏఆర్ఎస్ కార్మికులు శరత్, లక్ష్మి, రిజ్వాన్, కిష్టమ్మ, నర్సింగ్, రవి, సంగీత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

టీజీవీపీ ఆవిర్భావ వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న టీజీవీపీ నాయకులు

ఎదులాపురం: తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీసీ స్టడీ సర్కిల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ బాబు, ఉమ్మడి జిల్లా లంబాడా ఐక్యవేదిక జాదవ్ మహేందర్, టీజీవీపీ పట్టణ కన్వీనర్ ప్రవీణ్, బోథ్ నియోజకవర్గ కో కన్వీనర్ సతీశ్, శివ, నిర్మల, కార్యకర్తలు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రాష్ట్ర నాయకుడు వంగపల్లి చేపట్టే దీక్షకు జిల్లా నుంచి నాయకులు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా నాయకులు బొజ్జ అడెల్లు, బండారి అశోక్, విఠల్, జితేందర్, గణేశ్, అరవింద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన ఇద్దరికి సన్మానం



సన్మానిస్తున్న డీడీ దిలీప్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి విలువిద్య పోటీల్లో చించుఘాట్ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పతకాలు సాధించారు. పెందూరు రూపకు బంగారు, సిడాం శ్రీజకు వెండిపతకాలు సాధించగా, వీరిని ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ మంగళవారం సన్మానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్ మారుతి, పీడీ రవీందర్, హెచ్ఎం అరుణ ఉన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



బోనాలతో విద్యార్థులు

నేరడిగొండ: ఆషాడబోనాల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రోల్ మామడ మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బోనాలు ఎత్తుకొని ఊరేగింపు చేపట్టారు. విద్యార్థుల పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు అంబారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రుణమాఫీ సంబురాలు

ఇచ్చోడ/తాంసి: లక్షన్నరలోపు రుణమాఫీ సందర్భాన్ని పురస్కరించుకొని ఇచ్చోడ, తాంసి మండలం బండల్‌నాగాపూర్ రైతువేదికల వద్ద మంగళవారం రైతులు సంబురాలు జరుపుకొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని విన్నారు. ఇచ్చోడ ఏవో జాదవ్ కైలాస్, తాంసి మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఏఈవోలు వెంకట్, శివ, యోగిరాజ్, రైతులు ఉన్నారు.

లక్షన్నర రుణమాఫీ చారిత్రాత్మకం

కైలాస్‌నగర్: రూ.2 లక్షల రుణమాఫీ దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమైందని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చివరివిడతలో రెండు లక్షల్లోపు రుణమాఫీ నం ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని వివరించారు.

సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఉట్నూర్ ఎంపీడీవో రాంప్రసాద్‌ను మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి మంగళవారం సన్మానించారు. మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరామన్నారు. సత్తన్న, మనోహర్, శ్రీనివాస్, సాజిద్ ఉన్నారు.

బోథ్‌లో..

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా రావుల శంకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు సన్మానించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు సురేష్ వైద్య, అమరేందర్, ధనుంజయ్, భైరి సతీశ్, ప్రశాంత్ కుమార్, వీడీసీ చైర్మన్ ఇంద్రారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, గిన్నూ ర్ రాజేశ్వర్ రెడ్డి, గంగారాం, స్వామి, ఈశ్వర్ ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కి వీడ్కోలు

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత మెదక్ జిల్లాకు బదిలీయ్యారు. మంగళవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆమెను సన్మానించారు. విద్యార్థినులు ఆమెకు వీడ్కోలు పలికి కన్నీటి పర్యంతమయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఓమయ్య, చరణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తే గుర్తింపు

ఇచ్చోడ: ప్రజలకు మెరుగైన సేవలందిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ తుకారాం అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, సీనియర్ అసిస్టెంట్ నూర్‌సింగ్, జూనియర్ అసిస్టెంట్ స్రవంతి, అటెండర్ పాషాలను బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం వారిని సన్మానించారు. ఆర్ఐ హుస్సేన్, సర్వేయర్ బాపురావు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన ఎంపీడీవో దత్తారావు తండ్రి కిషన్ మహరాజ్ ఇటీవల మృతి చెందారు. మండల కేంద్రంలో మంగళవారం దశదిన కర్మ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ తదితరులు పాల్గొని చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. బాబులాల్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశల ముందస్తు అరెస్టు

ఇంద్రవెల్లి: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ హైదరాబాద్‌లోని హెల్త్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న మండల ఆశ కార్యకర్తలను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. సీఐటీయు ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు సిడాం కాంతబాయి, ఆశలు వనమాల, దుర్పత, సోను, గోదావరి, తులిసి, సంగీత, రంభ, సుమిత్ర తదితరులున్నారు.

ఘనంగా సిత్ల పండుగ

నేరడిగొండ: మండలంలోని వాగ్ధారి, బొందిడి గ్రామాల్లో సిత్ల పండుగను గిరిజనులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తమ వేషధారణ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతిని పూజించడం, ప్రేమించడం తమ ప్రత్యేకతని గిరిజనులు తెలిపారు. ఏటా ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

నేడు వనమహోత్సవం

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాంధీ పార్కులో బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో వివిధ రకా ల మొక్కలు నాటనున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

మౌనదీక్షలో పాల్గొన్న రిటైర్డ్ టీచర్లు

బోథ్: తమ డిమాండ్ల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మంగళవారం చేపట్టిన మౌనదీక్షలో బోథ్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలన్నారు. ఇందులో సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, రావుల గణపతి, గోవర్ధన్, నాయకులు ఉన్నారు.

పరామర్శ

ఎదులాపురం: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కిష్టు ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి జోగురామన్న మంగళవారం పరామర్శించారు. కౌన్సిలర్ కొండ గణేశ్, ధర్మపాల్, సంజయ్, నల్ల మహేందర్, తదితరులు ఉన్నారు.

చెట్టు కింద గ్రామసభ



కింద కూర్చున్న ప్రత్యేకాధికారి, అధికారులు

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరిలో చెట్టు కింద మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభ నిర్వహించడానికి స్థలం లేకపోవడంతో చెట్టు కింద టార్పాలిన్‌ను వేసి ప్రత్యేకాధికారి సౌందర్య, అధికారులు కూర్చున్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, కాలువల్లో బ్లీచింగ్ చల్లాలన్నారు. నిధులు లేకపోవడంతో పంచాయతీలో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.